క్లుప్తంగా

గ్రామ కమిటీ ఏకగ్రీవం

దమ్మపేట: మండల పరిధిలోని రంగువారిగూడెం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం రంగువారిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కొనకళ్ళ భద్రరావు, ఉపాధ్యాక్షుడిగా ఆళ్ల పండు, ప్రధాన కార్యదర్శిగా చిలకా కృష్ణయ్య, సహాయ కార్యదర్శిగా చెప్పుల జగదీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముళ్లపూడి వెంకటేశ్వరరావు, పెనుబల్లి సురేష్, రేగళ్ల భూషణం పాల్గొన్నారు.

పైరవీకారులకే జాబితాలో చోటు

బూర్గంపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు ప్రకటించిన అర్హుల జాబితాలో పైరవీకారులకే పెద్దపీట వేశారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ ఆరోపించారు. శనివారం బూర్గంపాడులోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలలో కోటీశ్వరులకు స్థానం కల్పించిన అధికారులు నిరుపేదలకు మొండిచేయి చూపించారన్నారు. అధికారులు స్పందించి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కోరారు.

28న ఐక్యత సభ

మణుగూరురూరల్: ఈ నెల 28వ తేదీన ఖమ్మంలో జరిగే ప్రగతిశీల రెండు ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఐక్యత సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రణయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం మణుగూరు ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఐక్యత సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాస్త్రీయ విద్యనే ధ్యేయంగా, ఒకే ఎజెండాగా పని చేస్తున్న రెండు పీడీఎస్‌యూలు ఈ నెల 28న ఏకమై విద్యార్థి లోకం తరపున పోరాడనున్నాయన్నారు. ఈ ఐక్యత సభకు విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, నవీన్, ఉదయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాసాని మృతి తీరని లోటు

చండ్రుగొండ: సీపీఎం సీనియర్ నాయకుడు కాసాని ఐలయ్య మృతి రాజకీయంగా తీరని లోటని మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, కూలీలు, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలపై ఆయన రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బూర్గంపాడు: సీపీఎం సీనియర్ నాయకుడు కాసాని ఐలయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో ఐలయ్య మృతికి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ అభ్యున్నతి కోసం నిస్వార్థంగా కాసాని చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాపినేని సరోజని, బయ్యా రాము, ఎస్కే అబీదా, ఎస్డీ హుస్సేన్, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య అనారోగ్యంతో మృతి చెందడంపై సీపీఎం మండల కమిటీ నాయకులు శనివారం విప్లవ జోహార్లతో ఘన నివాళ్లర్పించారు. తొలుత కాసాని ఐలయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడారు. లెనిన్‌బాబు, రాజు, పిట్టల నాగమణి, కె.బసవయ్య, లక్ష్మణరావు, నాగేశ్వరరావు, నరసింహారావు, హమాలీ సంఘం నాయకులు సాంబయ్య, శ్రీను, నరసయ్య, ఎల్లయ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీఎం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వచ్చే నెల ఫిబ్రవరి 4,5,6 తేదీల్లో 23వ భద్రాద్రి కళాభారతి అంతరాష్ట్ర నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక చిన జీయర్ మఠంలో భద్రాద్రి కళాభారతి సభ్యులు బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వచ్చే నెల ఫిబ్రవరి 4,5,6 తేదీల్లో దాతలు సహకారంతో జరిగే ఈ కార్యక్రమానికి జయప్రదం చేయాలని కోరారు. తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్టు, భారతీదేవి మెమోరియల్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ, ఐటీసీ పరిశ్రమ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంబురాలను నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఆర్టీసీ డీఎం తిరుపతి, వెంకటాచార్యులు, రాము, అల్లం నాగేశ్వరరావు, నర్సింహారావు, భూపతిరావు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలుచోట్ల కార్యక్రమాలు జరిగాయి. అధికారులు తహసీల్దార్ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు, కళాశాలలు ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా పలు రకాల పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేట: ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



ములకలపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది



దుమ్ముగూడెం: విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



బూర్గంపాడు: సోంపల్లి పాఠశాలలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు..



మణుగూరుటౌన్: ర్యాలీగా వెళ్తున్న అధికారులు



చండ్రుగొండ: కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ సంధ్యారాణి



అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కరకగూడెం: విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడీఓ అశోక్

కరకగూడెం: విద్యార్థులు చదువుతో పాటు ఇతర నైపుణ్యాలు ఆటలు,కళలు పెంపొందించుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ఏటీడీఓ అశోక్ అన్నారు. శనివారం చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నించే తత్వం కలిగి ఉంటూ సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడగాలని పేర్కొన్నారు. పాఠశాల నియమాలను పాటిస్తూ ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను గౌరవించడం మరవద్దని విద్యార్థులకు సూచించారు. అలాగే ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. మెనూ ప్రకారం భోజనం అందివాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు,వార్డెన్ శంకర్ పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో ప్రతిభకు పట్టం



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న ఏశ్వితసాయి రోహిణిశ్రీ

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 22వ తేదీన మండల స్థాయిలో 'నా ఓటు విధిగా వినియోగించుకుంటాను'అనే అంశంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాస రచన, డ్రాయింగ్, ఉపన్యాస విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కాగా, 23వ తేదీన జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కలెక్టరేట్ నిర్వహించిన పోటీల్లో అశ్వారావుపేటలోని జవహర్ విద్యాలయానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎల్.ఏశ్వితసాయి రోహిణిశ్రీ డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ స్థానం, నారాయణపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన డింపుల్ ఉపన్యాస పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శనివారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఓటర్ల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలను అందించి అభినందించారు. అదే విధంగా మండల స్థాయిలో జరిగిన పోటీల్లో జూనియర్ విభాగంలో కూడా డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో ఏశ్వితసాయి రోహిణిశ్రీ ప్రథమ స్థానం సాధించి బమహుతులు అందుకుంది.

పలువురికి పరామర్శ

దమ్మపేట: మండల పరిధిలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను, బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. మండలంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన విజయరామరాజు ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. చెన్నువారిగూడెంలో కట్టం రాముడు మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, రెడ్డిమళ్ల నాగయ్య, కొర్సా వెంకటేష్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలతో బీఆర్ఎస్‌కు బెంగ



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్, నాయకులు

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పార్టీ నాలుగు పథకాల అర్హులతో గ్రామసభ చూసి బీఆర్ఎస్ నాయకులు బెంగ పెట్టుకుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ విమర్శించారురు. శనివారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు శివ సైదులుతో కలిసి మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో రేషన్‌కార్డు ఇవ్వలేని దుస్థితి వాళ్లది అని ఆరోపించారు. ప్రభుత్వం పారదర్శకంగా పథకాల అమలు చేయడంతో బీఆర్ఎస్ కార్యకర్తలకు కూడా లబ్ధి చేకూరడంతో కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితుల వుతున్నారన్నారు. ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తూ దోపిడీదారులైన బీఆర్ఎస్ నాయకుల బారిన పడకుండా పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుబ్బారెడ్డి, కూచిపూడి బాబు, పాలమూరి రాజు, గుడిపూడి కోటేశ్వరరావు, పాతూరి వెంకన్న, గాండ్ల సురేశ్, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, త్రిమూర్తి, యాకూబ్ అలీ, వెంకట్రావ్, మహబూబ్ తదితరులు ఉన్నారు.

30 నుంచి ఆక్షన్ క్రికెట్ టోర్నమెంట్

మణుగూరురూరల్: మున్సిపాలిటి పరిధిలోని మణుగూరు పాత స్టోర్ గ్రౌండ్‌లో పున్నం లక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి జిల్లా స్థాయి ఆక్షన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ ఉమమాస్టర్ తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన క్రీడాకారులు ముందుగా 12 సభ్యుల జట్టుతో కూడిన వివరాలతో రూ.2వేల జట్టు రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.200 ప్లేయర్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. టోర్నమెంట్‌లో గెలిచిన విజేత జట్టుకు రూ.30వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.20వేలతో పాటు ట్రోఫి అందజేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9949100250, 7780528516 లకు సంప్రదించాలని తెలిపారు.

స్కూటీ దగ్ధం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన రోజా అనే మహిళ శుక్రవారం రాత్రి తన ఇంటి ఎదుట స్కూటీని పార్క్ చేసి ఉంచగా.. తెల్లవారి లేచి చూసేసరికి దగ్ధమై ఉంది. దీంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పట్టణ ఎస్సై విజయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రికెట్ పోటీల్లో ప్రతిభ

మణుగూరురూరల్: ఇటీవలే జరిగిన జిల్లా స్థాయి అండర్–17 క్రికెట్ పోటీల్లో మణుగూరులోని రాధికా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి వి.రాహుల్ నాయక్ సత్తా చాటాడు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థి రాహుల్ నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థి జిల్లా స్థాయి పోటీల్లో రాణించి టీడీసీఏ అండర్ 17 ఇంటర్ డిస్ట్రిక్ట్ టి20 టోర్నమెంట్‌కు ఎంపికై నట్లు తెలిపారు. అకాడమిక్ డీన్, పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం..


చర్ల: మండల కేంద్రంలోని చర్లలోని గురుదేవ్ విద్యాలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజులు కొనసాగనున్న ఈ వేడకల్లో భాగంగా శనివారం మండల విద్యశాఖాధికారి పీవీ రమణ జ్యోతిప్రజ్వలన చేసి, నమస్కృతి లోగోను ఆవిష్కరించి వార్షికోత్సవ వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యశాఖాధికారి పీవీ రమణ మాట్లాడారు. విద్యాలయం అధ్యపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

4న జనరల్ కౌన్సిల్ సభ

గుండాల: ఫిబ్రవరి 4, 5వ తేదీల్లో భద్రాచలం పట్టణం బత్తుల నగర్‌లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం ఇల్లందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ బలోపేతానికి ఏమాత్రం కృషి చేయడం లేదన్నారు. ఫీజు చెల్లించకపోవడంతో పేద బడుగుబలహీన వర్గాల విద్యార్థులకు విద్య భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర జనరల్ కౌన్సిల్ భవిష్యత్ ఉద్యమ రూపకల్పన చేసి విద్యార్థి ఉద్యమాన్ని ముందుకు తీసుకవెళ్తుందని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సఫియా, అఖిల, హర్ష, శ్రుతి, అనీల్, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల సందర్శన



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ నిశాంత్‌రావు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బెస్తగూడెంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాన్ని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ నిశాంత్ రావు శనివారం సందర్శించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరైన సమయంలో పిల్లలకు టీకాలు వేయాలని, తదుపరి టీకాల తేదీని తల్లిదండ్రులకు గుర్తు చేయాలని సూచించారు. ఏఈఎఫ్ఐ కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులకు క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. తిర్లాపురం సబ్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, శైలజ, రవి, వెంకటమ్మ, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



మణుగూరుటౌన్: రిబ్బన్ కట్ చేసి సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: పట్టణంలోని రూ.20లక్షల విలువైన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపనలు చేశారు. నిర్మించిన రోడ్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మామిడిచెట్ల గుంపులో స్కూల్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన కాంపౌండ్ వాల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆదివాసీ నగర్, ఆదర్శనగర్‌లో రూ.5లక్షల వ్యయం చొప్పున నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు విశేష కృషి చేస్తుందన్నారు. అదేవిధంగా ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన వారు దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు.

దివ్యాంగులకు చెక్కుల పంపిణీ..

ప్రజాభవన్ కార్యాలయంలో ఆళ్లపల్లి, గుండాల మండలాలకు చెందిన ముగ్గురు దివ్యాంగులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ 50వేల చొప్పున 1.50లక్షల విలువైన దివ్యాంగుల సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కమిషనర్ యాదగిరి, మండల కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ, సౌజన్య, కూచిపూడి బాబు, కుర్రం రవి తదితరులు పాల్గొన్నారు.

గుండాల: దివ్యాంగులు మనోధైర్యాన్ని కోల్పోకుండా ఆర్థికంగా స్వశక్తితో ఎదగాలని, వారికి ఆర్థిక భరోసా కల్పించామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మణుగూరులో గుండాల మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన వాగబోయిన నర్సింహరావు, కొవడటంచ గ్రామానికి చెందిన అనంత కుమార్, ఆళ్లపల్లి మండలం రాయిపాడుకు చెందిన తుమ్మ లక్ష్మిలకు ఒక్కొక్కరికి రూ. 50వేల చొప్పున అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీఎస్ఎస్–పీవీఆర్ యువసేన కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎస్‌కె.ఖదీర్, రాజేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

అశ్వాపురం: మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి రమేష్‌బాబు, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కందిమళ్ల రామిరెడ్డి, గొల్లపల్లి నరేష్, హర్షనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

పినపాక: గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ లక్ష్యమని, స్వచ్ఛ గ్రామాలుగా మార్చడమే ధ్యేయమని పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలో పర్యటించిన ఆయన మల్లారం పంచాయతీలో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం పంచాయతీ పరిధిలో గ్రావెల్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు అధిక నిధులు కేటాయించి మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. జనవరి 26 నుంచి ప్రభుత్వం నాలుగు పథకాలను ప్రారంభిస్తుందని తద్వారా రైతులు, ఇల్లు లేని వారు లబ్ధిపొందినందుకు వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖాధికారి రాందాస్ నాయక్

అశ్వారావుపేటరూరల్: టీబీ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా ఆరు నెలలపాటు వాడాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని దబ్బతోగు కాలనీ గ్రామంలో వంద రోజుల టీబీ సీవిర్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. టీబీ వ్యాధితో బాధపడే వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని, టీబీ లక్షణాలు ఉంటే తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అదే విధంగా పోషకాహారాన్ని తీసుకోవాలని, జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎస్ వెంకట్, హెచ్ఎస్ రవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహన తనిఖీల పరిశీలన



వాహన తనిఖీని పరిశీలిస్తున్న ఏఎస్పీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద కొనసాగుతున్న వాహన తనిఖీలను భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ శనివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వాహనం వివరాలను తనిఖీ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. విధుల పట్ల సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యాన్ని వహించవద్దని. నిషేధిత వస్తువులు రవాణాను ఖచ్చితంగా అడ్డుకోవాలని సూచించారు. అనుమానం కలిగిన ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఏఎస్పీ వెంట పట్టణ సీఐ రమేష్, చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

అశ్వారావుపేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సయ్యద్ సలీం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల అమలు పేరుతో నిర్వహించిన గ్రామసభలు లోపభూయిష్టంగా జరిగాయన్నారు. సర్వేలను రద్దు చేసి నిజమైన లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, నాయకులు పఠాన్ జలాల్, రహంతుల్లా, కూనవరపు విజయ్‌కాంత్, జక్కం బలరాం పాల్గొన్నారు.

టిప్పర్ ఓనర్ల నిరసన

మణుగూరుటౌన్: బీటీపీఎస్‌కు బొగ్గు తరలిస్తున్న లారీల బిల్లులు మూడు నెలలుగా చెల్లించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని టిప్పర్ ఓనర్లు శనివారం నిరసన తెలిపి నాలుగు గంటలకు పైగా రవాణా నిలిపివేశారు. లారీ కాంటా వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో అధ్యక్షుడు ముప్పారపు రామారావు, సెక్రటరీ కంకణాల భాస్కర్‌రావు, నాదెళ్ల శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. ఈ నెల 16న సమ్మె నోటీస్ అందించిన సమయంలో 21న పెండింగ్ కిరాయి బిల్లులు కాంట్రాక్టర్ చెల్లిస్తామన్న హామీపై బొగ్గు రవాణా చేశామన్నారు. అయినా నేటికీ స్పందన లేకపోవడంతో ఈ రోజు నిరసన తెలిపి 27వ తేదీ నాటికి పెండింగ్ బిల్లులు చెల్లించని పక్షంలో 28 నుంచి టిప్పర్ల ద్వారా బొగ్గు రవాణా నిలిపివేసి నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ట్రెజరర్ సాగర్‌రెడ్డి, మదార్ హుస్సేన్, బంగారు చారి, పొన్న కనకయ్య తదితరులు ఉన్నారు.

బీటీపీఎస్ మెయిన్ గేట్ ప్రారంభం



పూజలు చేస్తున్న జెన్‌కో డైరెక్టర్(సివిల్) అజయ్

మణుగూరురూరల్: మండలంలోని బీటీపీఎస్ మెయిన్ గేట్‌ను జెన్‌కో డైరెక్టర్(సివిల్) అజయ్ శనివారం ప్రారంభించారు. తొలుత అజయ్‌తో పాటు డైరెక్టర్లు లక్ష్మయ్య, సచ్చిదానందకు సీఈ బి.బిచ్చన్న స్వాగతం పలికారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద వారు మొక్కలు నాటారు. సివిల్ ఎస్ఈ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కెచ్చెల కల్పన

అశ్వారావుపేట: జిల్లాలో నానాటికీ పెరుగుతున్న వైద్య సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవైఎల్) జిల్లా కార్యదర్శి కెచ్చెల కల్పన డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో కల్పన మాట్లాడుతూ.. పీవైఎల్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో సర్వే నిర్వహించామన్నారు. సమస్యలను పరిష్కరించాలని దశల వారిగా ఆందోళనలు నిర్వహించామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీఎంహెచ్‌ఓ కార్యాలయాల ఎదుట జనవరి 31న ప్రదర్శన, ధర్నా నిర్వహించ తలపెట్టామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవైఎస్ జిల్లా కార్యవర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై.సావిత్రి, సహాయ కార్యదర్శి వై.సరోజిని, టి.దుర్గ, జిల్లా ఉపాధ్యక్షుడు భూలక్ష్మి, కల్లూరి పద్మ,కోశాధికారి కోరం ముత్తమ్మ, కోండ్రు లక్ష్మి, గోకినపల్లి గంగ, కుండా అర్జున్, వాసం బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.